


రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మర్పల్లి, జూలై 22: అర్హులైన రైతులు తప్పనిసరిగా రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి వసంత సోమవారం పేర్కొన్నారు. 18-59 సంవత్సరాల్లోపు అర్హులైన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో రైతు బీమా ఫారం, పట్టాదారు పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లను నేరుగా వ్యవసాయశాఖ అధికారులకు అందజేయాలన్నారు.

కొత్త సర్కారుపై.. కోటి ఆశలు!

నిధుల కేటాయింపులో ఉమ్మడి జిల్లాకు పెద్దపీట ఉండేనా?



కొత్త సర్కారుపై ఉమ్మడి రంగారెడ్డి వాసులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సమస్యలు పరిష్కరించేందుకు సర్కారు నిధులు పెద్ద ఎత్తున కేటాయిస్తుందని అందరూ ఆశిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నుంచి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇదే జిల్లా వికారాబాద్ శాసనసభ స్థానం నుంచి ప్రాతినిథ్యం వహిస్తుండడంతో ఈ సారి ఉమ్మడి జిల్లాపై అభివృద్ధికి అడుగులు పడతాయని భావిస్తున్నారు. నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనుండడంతో జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల గురించి అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సిద్ధమయ్యారు.

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించేనా?
- మెట్రో పరుగులు పెట్టేనా..?
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- సమస్యలు, అభివృద్ధికి నిధుల గురించి చర్చించేందుకు ఎమ్మెల్యేలు సిద్ధం
- సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌లపై కొండంత ఆశ

ఆంధ్రజ్యోతి, వికారాబాద్, జూలై 22 : నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. మంగళవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. దీంతో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా, ఈ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెడుతోంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇచ్చిన ఇతర హామీల అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి ప్రభుత్వం వివరించే అవకాశం ఉంది. అంతేకాకుండా జాబ్ క్యాలెండర్, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు తదితర అంశాలపై ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం కీలక ప్రకటన చేయనుంది. ఇదిలా ఉంటే, ఈ బడ్జెట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు నిధుల కేటాయింపు ఏ విధంగా ఉండనుందనేదే జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పాలమూరు ఎత్తిపోతల పథకం పరుగులు పెట్టేనా..

వికారాబాద్, రంగారెడ్డి జిల్లా వాసులు ఎంతగానో ఆశలు పెట్టుకున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికారాబాద్‌లో నిర్వహించిన ప్రచార సభలో పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా వికారాబాద్,



రంగారెడ్డి జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు తీసుకువచ్చి సస్యశ్యామలం చేస్తామని గత సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. కానీ అమలుకు నోచుకోలేక పోయింది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ ప్రాజెక్టుపై ఆశలు పెట్టుకున్నారు. అయిదేళ్లుగా చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయింపులు జరగలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రాణహిత - చేవెళ్ల, కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేసినా ఆ రెండు పథకాలకు ముందడుగు పడడం లేదు. జిల్లాలో రైతులు అధికంగా వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టులు, చెరువులు ఉన్నా నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. వర్షం, బోరుబావులనే నమ్ముకుని రైతులు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రాజెక్టులకు, చెరువులకు సరైన మరమ్మతులు లేక, కాల్వలు శిథిలావస్థకు చేరాయి. తూములు, కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఏళ్ల తరబడి గేట్‌వాల్వ్‌లు కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కోట్‌పల్లి, లక్నాపూర్, నందివాగు, జుంటుపల్లి, సర్పన్‌పల్లి, కొంశెట్‌పల్లి తదితర ప్రాజెక్టుల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు, ఆధునీకరణ పనులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శివసాగర్, నవాంద్గి ఎత్తిపోతల పథకం పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటే అన్నదాతలకు మేలు జరగనుంది.

మెట్రోకు నిధుల కేటాయింపు జరిగేనా?



గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును మహేశ్వరం పరిధిలోని కందుకూరు వరకు పొడిగిస్తామని హామీ ఇచ్చింది. కానీ.. అమలుకు నోచుకోలేదు. మొదటి దశలోనే హైటెక్ సిటీ నుంచి శంషాబాద్ వరకు, రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం నుంచి కందుకూరు వరకు పొడిగిస్తామని ప్రకటించారు. అలాగే మైండ్ స్పేస్ నుంచి గచ్చిబౌలి, నానక్‌రామ్‌గూడ జంక్షన్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు సౌకర్యం కల్పించనున్నట్లు గత సీఎం కేసీఆర్ ప్రకటించినా సాధ్య పడలేదు. త్వరలోనే హయత్‌నగర్‌కు మెట్రో రాబోతుంది. ఇందుకు సంబంధించి అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయి. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో వివిధ యూనివర్సిటీలను, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని సీఎం తెలిపారు. కొడంగల్ ప్రాంతానికి సాగు,తాగునీటి సమస్య ఎంతో కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. యువతకు ఉపాధి కల్పించే దిశగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ పరిశ్రమ నెలకొల్పితే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ సర్వే పనులు కొనసాగుతున్నాయి. కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి అవసరమైన నిధులు విడుదలైతేనే ఈ పనులు ముందుకు సాగనున్నాయి. పోలెపల్లి ఎల్లమ్మ, మద్దూర్ మండలంలో బావోజీ ఆలయాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సి ఉంది. పరిగి, కొడంగల్ మీదుగా వికారాబాద్ - కృష్ణ రైల్వేలైను, నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పరిశ్రమల స్థాపన, పరిగిప్రభుత్వాసుపత్రి స్థాయి పెంపు, పరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం, పరిగి నియోజకవర్గానికి నీటి సరఫరా, మునిసిపాలిటీలో అండర్ డ్రైనేజీ, సబ్‌స్టేషన్ల ఏర్పాటు, పరిగిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి.

కలగా మారిన గ్రామీణ విశ్వవిద్యాలయం

వికారాబాద్ జిల్లాలో అన్ని రకాల ఉన్నత విద్యలు ఒకే గొడుగు కిందకు వచ్చేలా గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, తాండూరులో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రతీ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. అంతే కాకుండా కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ఏడేళ్లుగా గత ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లిన విషయం తెలిసిందే. వికారాబాద్, పరిగిలో కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసినా సొంత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే, జిల్లా మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడితే రవాణా సదుపాయం మెరుగై కొత్త పరిశ్రమలు రావడానికి అవకాశం ఉంటుందని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పడడమే కాకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందని జిల్లా ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

అనంతగిరికి పర్యాటక శోభ

వారాంతాలు, సెలవు రోజుల్లో అనంతగిరి కొండలు, కోట్‌పల్లి ప్రాజెక్టును వేలాది మంది సందర్శకులు సందర్శిస్తుంటారు. జిల్లాకు మణిహారంగా భావించే అనంతగిరి కొండలు, కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అనంతగిరిని ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం జంగిల్ రిసార్ట్స్, అడ్వంచర్ పార్క్, ట్రెక్కింగ్ పరంగా అభివృద్ధి పరిచి పర్యాటకులను మరింత



ఎక్కువగా ఆకర్షించేలా పర్యాటకంగా అభివృద్ధి పరచాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. అనంతగిరిని పర్యావరణ, ఆధ్యాత్మిక, ఆరోగ్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుంది. కోట్‌పల్లి ప్రాజెక్టును మరో లక్నవరంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి అవసరమైన నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో ప్రముఖ దేవాలయాలైన శ్రీఅనంత పద్మనాభ స్వామి, బుగ్గ రామలింగేశ్వర స్వామి, కొత్తపల్లి మర్రిచెట్టు, పాంబండ రామలింగేశ్వరస్వామి, దామగుండం తదితర దేవాలయాలను అభివృద్ధి పరచాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది.

ట్రాఫిక్ సమస్య తీర్చేనా..?

వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధానంగా పట్టణం చుట్టూ రెండు వైపులా రైల్వే లైన్ల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ట్రాక్ కారణంగా ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్న అనంతగిరి, రామయ్యగూడ మార్గాల్లో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. రైల్వే గేటు పడినప్పుడు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. జిల్లా కేంద్రమైన వికారాబాద్ మినీ స్టేడియానికి కూడా నోచుకోవడం లేదు. స్థలం కేటాయించి ఏడేళ్లు గడుస్తున్నా ఆ పనులు ముందుకు సాగకపోవడం గమనార్హం. పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడల ఏర్పాటు ప్రక్రియలో వేగం పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొడంగల్ నియోజకవర్గంతో పాటు పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తేనే జిల్లా సమగ్రాభివృద్ధికి మార్గం ఏర్పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వీరిపైనే ఆశలు

వికారాబాద్ జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీ వారే కావడం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇదే జిల్లా నుంచే శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచడానికి నిధుల కేటాయింపు ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటక, ఉపాధిరంగాల పరంగా జిల్లాకు ఏ విధమైన కేటాయింపులు ఉండనున్నాయోనన్న చర్చ కొనసాగుతోంది. అధిక నిధులు కేటాయింపుతో పాటు జిల్లా అభివృద్ధికి దోహదపడే కొత్త ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కీలక ప్రకటన చేస్తుందా అని జిల్లా ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది నెలల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పరుగులు పెట్టించే విధంగా సీఎం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి, వెటర్నరీ, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలల ఏర్పాటు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాది దౌల్తాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయగా, ఈ ఏడాది బొంరాస్‌పేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పేదల తిరుపతిగా పేరు పొందిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయాన్ని విస్తరించే విధంగా బృహత్తర ప్రణాళిక సిద్ధం చేశారు. కొడంగల్ మీదుగా వికారాబాద్ - కృష్ణ రైల్వేలైన్ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించిన విషయం తెలిసిందే. కొడంగల్ ప్రాంత సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ఏర్పాటు చేసి పనుల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిని నియమించిన విషయం తెలిసిందే. విద్యాసంస్థలతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమల ఏర్పాటుకూ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంతకాలం వెనకబాటుకు గురైన కొడంగల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరచాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న దామగుండం నేవీ రాడార్ (వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్) ప్రాజెక్టు త్వరలో సాకారం కాబోతోంది. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే ఈ ప్రాజెక్టులో కదలిక వచ్చిందన్న చర్చ సాగుతోంది.

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాధికా గుప్తా



మేడ్చల్ జూలై 22(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా రాధికా గుప్తా సోమవారం బాధ్యతలుస్వీకరించారు. అనంతరం ఆమెమర్యాద పూర్వకంగా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి పుష్పగుచ్ఛంఅందజేశారు బాధ్యతలు స్వీకరించిన రాధికా గుప్తాను అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ కలిసి అభినందనలు తెలియజేశారు.



ట్రాన్స్‌జెండర్స్‌తో కలెక్టర్ గౌతమ్

ట్రాన్స్‌జెండర్స్‌కు చేయూత

మేడ్చల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ట్రాన్స్‌జెండర్స్‌కు చేయూతనందించేందుకు ప్రభుత్వం నుంచి సహాయాన్ని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ అందజేశారు. ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం కింద జిల్లాలోని 21 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున మొత్తం రూ. 5.50లక్షల చెక్కులను కలెక్టర్ వారికి అందజేశారు. వందశాతం సబ్సిడీతో వారికి చేయూతనందించి ఏదైనా వ్యాపారం చేసుకోవ డానికి తోడ్పాటు కల్పించినట్లు అధికారులు తెలియజేశారు. అదేవిధంగా వారికి ఐడీ కార్డులు కూడా అందజేశారు. వారికి సులువుగా రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు చేయడానికి ఐడీ కార్డులు దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్‌లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌ఓ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేత

జిల్లాలోని చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూట్ సంస్థలోని అనాథ చిన్నారులకు వారి చదువులు సజావుగా కొనసాగడానికి తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో మంజూరు చేసిన జనన, కుల ధృవీకరణ పత్రాలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ అందజేశారు. కార్యక్రమంలో బాలరక్ష భవం కోఆర్డినేటర్ నాగమణి, ఇంతియాజ్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 22 : ప్రతి జిల్లా అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని, ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 178 మంది సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెంట వెంటనే పరిష్కారం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, ట్రైయినీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలకు ఇన్నోవేటర్

వినూత్న ఆవిష్కరణలకు ఇన్నోవేటర్ అవకాశం కల్పిస్తోందని, ఆగస్టు 3వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలలస్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, చిరునామా, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాలలో రాసి పంపాలని, ఆవిష్కరణ ఫొటోలు, 2నిమిషాలకు పైగా ఆవిష్కరణ వీడియో తెలంగాణ ఇన్నోవేషన్ వాట్సాప్ నెంబర్ 9100678543కు గడువులోగాపంపాలన్నారు. స్వాతంత్ర్యవేడుకల సందర్భంగా ప్రదర్శన ఉంటుందని తెలిపారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

75 దరఖాస్తుల స్వీకరణ

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఆయా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణిలో 75 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్‌లు విజయేందర్‌రెడ్డి, రాధికాగుప్తా, డీఆర్‌ఓ హరిప్రియ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్ సమీక్ష



కడా కార్యాలయంలో కలెక్టర్లు, అధికారులతో సమీక్షిస్తున్న సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్

కొడంగల్, జూలై 22: జిల్లాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్ సూచించారు. సోమవారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తాపట్నాయక్‌లతో జిల్లాల్లో అభివృద్ధి పనులపై సమీక్షించారు. చేపట్టిన పనులు, తదితర అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, ట్రైయినీ కలెక్టర్లు ఉమాహారతి, గరిమనరుల, కడాప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ ప్రతీక్‌జైన్ సీఎంకార్యదర్శికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

మేడ్చల్ జూలై 22(ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున ఆశావర్కర్లు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి వెట్టి చాకిరి చేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ తదితర వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పెన్షన్ చెల్లించాలని కోరారు. ఆశా వర్కర్ల పలు సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికివినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏ.హేమలత, గణేష్, లింగస్వామి, రాజశేఖర్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుడి పల్లకీ సేవ

కీసర, జూలై22: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి పల్లకీ సేవ కనుల పండువగా జరిగింది. నిత్య సేవల్లో భాగంగా సోమవారం ఉదయం తెల్లవారుజామున గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవ మూర్తిని పల్లకీ పైఊరేగించారు. కాగా భజే శివమ్ విజయవంతం కావాలని చిత్రదర్శకుడు, హీరో అశ్విన్‌బాబు, ఇతర యూనిట్ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామివారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

మేడ్చల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాంకేతిక కారణాలు సాకుగా చూపుతూ రుణమాఫీపై ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అన్నారు. ఆయన మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌ను సోమవారం కలిసి జిల్లాలో ఏ సొసైటీలో ఎంత మందికి రుణమాఫీ అవుతుందో వివరించి అర్హులందరికీ రుణమాఫీ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రుణమాఫీ కింద దాదాపు రూ.39కోట్లు అవసరమవగా కేవలం రూ.12కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. వివిధ కారణాలతో రైతులకు రుణమాఫీ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రైతురుణమాఫీకి రేషన్‌కార్డు, పీఎం కిసాన్ నిబంధనల అమలు చేస్తున్నారన్నారు. రుణమాఫీలో కోతలు పెట్టేందుకే ఈ నిబంధనలు అమలు చేస్తున్నారని విమర్శించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఖాయం

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు ఖాయమని ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిపై కోర్టుకు వెళ్తామని చెప్పారు. కచ్చితంగా ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని, ఆ తర్వాత జరిగే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమన్నారు. తాను పార్టీ మారుతున్నాననే ప్రచారంలో వాస్తవం లేదన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాశాఖ అధికారి పల్వాన్‌కుమార్

బొంరాస్‌పేట్, జూలై 22: రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాల గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు వార్డులను పరిశీలించారు. రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమంలో భాగంగా బొంరాస్‌పేట్ పీహెచ్‌సీలో పైలెట్ ప్రాజెక్టుగా 18 సంవత్సరాల్లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు, వంశ పారంపర్యంగా వచ్చే లోపాలు, పెరుగుదల లోపాలను గుర్తించడానికి ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలోని రైతు వేదికను పరిశీలించారు. ఆయన వెంట వైద్యుడు హేమంత్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ

మేడ్చల్, జూలై 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 30వ తేదీ వరకు వారం రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలి రోజు ఉపాధ్యాయులు స్థానిక అవసరాలకనుగుణంగా అందుబాటులో ఉన్న సామగ్రితో టీఎల్ఎం రూపొందించి ప్రదర్శించారు. 23న నిపుణ్ భారత్, ఎఫ్ఎల్ఎస్, 24న క్రీడా, పయోజన వ్యవహారాలు, ఆటల పోటీలు, 25న విద్యార్థుల్లో ఐకమత్యం, భిన్నత్వం, అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు, 26న ప్రస్తుత ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు, డిజిటలీకరణపై అవగాహన, 27న పర్యావరణం, ఆరోగ్యం, జీవన విధానం, విటమిన్‌లతో కూడిన సమతుల ఆహారం గురించి అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా పాఠశాలల్లో మొక్కలు నాటి నూతనంగా ఏకో క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు. చివరి రోజు 30వ తేదీన పాఠశాలల అభివృద్ధిలో సమాజం భాగస్వామ్యం పెంపొందించేలా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచే వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పిస్తారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న చిన జీయర్ స్వామి

తాండూరు ఎమ్మెల్యేకు చినజీయర్ స్వామి సన్మానం

తాండూరు, జూలై 22: శ్రీ వైష్ణవి సేవా సంఘం రజతోత్సవ వేడుకల్లో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీత్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి (చినజీయర్‌స్వామి) చేతుల మీదుగా శాలువా కప్పి జ్ఞాపికను ఎమ్మెల్యేకు అందజేసి సన్మానించారు.

పరిగిలో వైభవంగా పోచమ్మ బోనాలు



పరిగిలో పోచమ్మ బోనాలు ఊరేగింపు

పరిగి, జూలై 22: పరిగి మున్సిపల్ పరిధిలో సోమవారం పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే మహిళలు ఇళ్లను శుభ్రం చేసి బోనాల ఉత్సవాలకు స్వాగతం పలికారు. బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో చేపలవల, ఫలహార బండి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పరిగి మాజీ సర్పంచ్ సిద్దాంతి పార్థసారథి, మాజీ జడ్పీటీసీలు ఎస్‌పీ. బాబయ్య, బి.హరిప్రియ ప్రవీణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణ ప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ పాల్గొన్నారు.

బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం.. రుణమాఫీకి దూరం

- పేద రైతులను ముంచుతున్న బ్యాంకర్లు
- అయోమయంలో బాధిత రైతులు

కొడంగల్ రూరల్, జూలై 22: నియోజకవర్గంలో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ఎరుకలి మల్లమ్మ, ఎరుకలి ఆశన్నలు ఇద్దరు భార్యాభర్తలు. వీరిద్దరు హస్నాబాద్ ఎస్బీఐ బ్యాంకులు తీసుకున్న రుణాన్ని 23.7.2020లో రెన్యూవల్ చేయడంతో కొత్తగా ఎరుకలి మల్లమ్మ అనే రైతుకు ఖాతా నెంబరు 52185238049లో రూ.25వేలు, ఎరుకలి ఆశన్న అనే రైతు ఖాతానెంబరు 52185238038లో రూ.56500 రుణాన్ని బ్యాంకు అధికారులు అందించారు. మల్లమ్మ మృతి చెందినా ఆమె పేరుపై రుణం మాత్రం అలాగే ఉంది. ప్రభుత్వం ఇటీవల రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసినట్లు ప్రకటించింది. దీంతో బాధితుల రుణాల రూ.లక్ష లోపు ఉండటంతో మాఫీ వచ్చిందని అనుకున్నారు. రెండు, మూడు రోజులు వేచిచూశారు. ఎంతకు సంబంధిత ఫోన్‌లకు మెసెజ్ రాకపోవడంతో వారి కుమారుడు సోమవారం సంబంధిత బ్యాంకు వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. మీ రుణాలు మాఫీ కాలేదని చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారుల దగ్గరికి వెళ్లి అడగగా ఇద్దరికి సంబంధించిన రుణాల వివరాలు తెలియరాలేదు. వ్యవసాయ శాఖ అధికారుల వెబ్‌సైట్‌లో నో డాటా ఫౌండ్ అని రావడంతో వెంటనే అధికారులు పంపించిన లిస్టును పరిశీలించారు. ఆ లిస్టులో కూడా పేరు లేకపోవడంతో బాధితులు కంగు తిన్నారు. తీరా చూస్తే బ్యాంకు అధికారుల నుంచి వీరిద్దరి పేర్లు రాలేవని వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. దీంతో బాధిత రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



ఎస్బీఐలో రైతులు తీసుకున్న రుణం రశీదులు

తమకు సంబంధం లేదంటున్న బ్యాంకు మేనేజర్

రుణాలు మాఫీ కాలేదని హస్నాబాద్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి సంబంధం ఉండదని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న మా ప్రధాన బ్యాంకు కార్యాలయం నుంచి పేర్లు పంపుతారని, అక్కడ తప్పిదం జరిగిందేమో అన్నారు. ఇక్కడ అయితే ఎలాంటి సమాచారం ఉండదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధిత రైతులు వాపోయారు.

భార్యాభర్తల రుణాలు మాఫీ చేయాలి



పంట రుణాల మాఫీలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించి మాకు అన్యాయం చేయడం తగదు. మా ఇద్దరివి కలిపి రూ.లక్ష లోపు రుణం ఉంది. వడ్డీలతో కలిపి రూ.లక్ష దాటినా ఒక్కొక్కరికి రూ.లక్ష దాటలేదు. వ్యవసాయ అధికారులను అడిగితే బ్యాంకర్లు మీ పేర్లు రుణమాఫీకి పంపించలేదంటున్నారు. బ్యాంకులో అడిగితే మాకు సంబంధం లేదని చెబుతున్నారు. ఎవరిని అడగాలి. మా రుణాలను మాఫీచేసి న్యాయం చేయాలి.

ఎరుకలి పెద్ద ఆశన్న, బాధిత రైతు, హస్నాబాద్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ముదిరాజ్‌లు

ముదిరాజులను బీసీ-ఏ గ్రూపులో చేర్చాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 22 : ముదిరాజులను బీసీ-డీ నుండి బీసీ-ఏ గ్రూపులో చేర్చాలని ముదిరాజ్ మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు బైరమోని మల్లేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందరంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా యువత అధ్యక్షుడు మహేందర్, జిల్లా సెక్రెటరీ కుక్కల కృష్ణ, కందుకూరు మండల అధ్యక్షుడు అంజయ్య, మండల యువత అధ్యక్షుడు కొర్వి సురేందర్, జిల్లా సీనియర్ నాయకుడు బాబురావు, మాజీ సర్పంచులు శ్రీహరి , ఢిల్లీ గణేష్, మాజీ ఎంపీటీసీ కాకి రాములు తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న భీమ్ భరత్, తదితరులు

గ్రామాలకు బస్సు సర్వీసు ప్రారంభం

చేవెళ్ల/శంకర్‌పల్లి, జూలై 22: 'ప్రమాణం.. ప్రమాదం' శీర్షికన ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తతో పర్వేదకు ఆర్టీసీ అధికారులు కొత్తగా బస్సు సర్వీసు వేశారు. పర్వేద విద్యార్థులు వేరే గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులపై కథనం ప్రచురితమైంది. వికారాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు అంతప్పగూడ మీదుగా చేవెళ్ల మండలం తంగడ్‌పల్లి, మడికట్టు గ్రామాల మీదుగా పర్వేదను కలుపుతూ బస్సు సర్వీసు వేశారు. సోమవారం బస్సును చెవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీమ్ భరత్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ సత్యనారాయణరెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు ఆటోల్లో కాకుండా బస్సులోనే ప్రయాణించాలని అన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం బస్సు సర్వీసు వేశామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ప్యాక్స్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బి.ఆగిరెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, అరుణ్‌కుమార్, కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, పెంటయ్య, సురేందర్‌గౌడ్, సంజీవరెడ్డి, శ్రీధర్, నసీరుద్దీన్, సుభాన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాగన్‌పల్లి గ్రామస్తులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 22 : ప్రభుత్వ భూమిని కాపాడాలని ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామస్తులు జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కోరారు. గ్రామంలోని సర్వే నంబర్లు 298, 297లలోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని తెలిపారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని కాపాడి, కబ్జాదారుల చర నుంచి విడిపించాలని వారు కోరారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బీసీల పట్ల ప్రభుత్వం మొసలి కన్నీరు

యాచారం. జూలై 22: బీసీల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని, బీ సీ కుల గణన ఎప్పుడు చేస్తారు? స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారని రాష్ట్ర ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు కొప్పు బాషా ప్రశ్నించారు. ప్రభుత్వంలో బీసీ సంక్షేమ శాఖకు మంత్రి లేకుండా బీసీలకు న్యాయం ఎలా చేస్తారో చెప్పాలని అన్నారు. చాలా చోట్ల బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతుల్లేవని వాపోయారు. బీసీలకు న్యాయం చేసేదాకా తాము బీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్ఐలు మురళి, రామకృష్ణలకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, విజయ్ కుమార్, యాదయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

ఘనంగా బోనాల వేడుక

కొత్తూర్, జూలై 22: గుడూర్‌లో సోమవారం గ్రామ దేవతలకు బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా నడువగా, శివసత్తుల, పోతురాజులు అలరించారు. బోనాలను ఆలయాలకు తెచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కొత్తూర్ మాజీ ఎంపీపీ పి.మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్తయ్య, దయానంద్‌గుప్తా, దర్శన్, సిద్ధూగౌడ్, రాజుగౌడ్, ఆంజనేయులు, సురేష్, మహేందర్‌రెడ్డి, రాజు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రంగారెడ్డి అర్బన్, జూలై 22: గ్రామ పంచాయతీ సిబ్బంది పెడింగ్ బిల్లులు తక్షణమే ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పాండు, గౌరవాధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరుతూ కలెక్టర్ శశాంకకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని, జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్‌లను సహాయక కార్యదర్శులుగా నియమించాలన్నారు. అర్హతున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదాల్లో మృతి చెందిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి బీమా పథకం రూ.5లక్షలకు పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దేవసాధు, నరేష్, కృష్ణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వ్యవసాయ యంత్రాలు

షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై రెండేళ్లు

- ఎండ, వానకు తుప్పు పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

కులకచర్ల, జూలై 22: లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేసి పేద రైతులకు కిరాయికి ఇచ్చే వ్యవసాయ యంత్రాలు షెడ్డు లేక ఎండ, వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి. మూడేళ్లుగా అవి నిరుపయోగంగానే ఉన్నాయి. వాటిపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో వృథాగా పడిఉన్నాయి. స్వచ్ఛందంగా కొనుగోలు చేసుకోలేని పేద రైతులకు ఉపయోగపడేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా కులకచర్ల మండల మహిళా సమాఖ్యకు వ్యవసాయ పరికరాలను ప్రభుత్వం రూ.54 లక్షలతో కొనుగోలు చేసింది. అయితే వాటికి సంబంధించి ఎమ్‌ఎమ్‌ఎస్ డబ్బులు రూ.27 లక్షలు, రుణ సహాయం రూ.27 లక్షలతో కొనుగోలు చేశారు. ఈ పరికరాలపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసే సమయంలో కిరాయికి ఇవ్వాలి. వరి పంట కోసే యంత్రం గంటకు రూ.1200, రోటోవెటర్ అద్దె రూ.2వేలు, మొక్కజొన్న తీసే యంత్రం కిరాయి రోజుకు రూ.2వేలు, ఎరువులు, విత్తనాలు వేసే యంత్రం రూ.1800 చొప్పున ఉన్నాయి. ఏడాది నుంచి చాలా తక్కువ మంది రైతులు యంత్రాలను వాడుకుంటున్నారు. అయితే ఎక్కువ మంది రైతులకు ఆసక్తి లేక కిరాయి చెల్లించలేక యంత్రాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ ప్రాంతంలో రైతులు పెట్టుబడి కోసం వ్యాపారులపై ఆధారపడి సాగు చేస్తుంటారు. దీంతో యంత్రాలు చెత్తలో పడేసినట్లుగానే ఉన్నాయి. షెడ్డు ఏర్పాటు చేస్తే తుప్పు పట్టకుండా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

షెడ్డు నిర్మాణంలో జాప్యం

మూడేళ్ల కిందట మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి వచ్చిన వ్యవసాయ పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం షెడ్డు నిర్మాణానికి రూ.9లక్షల 50వేలు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక్కడి ప్రజాప్రతినిధి టెండర్ తీసుకున్నాడు. కానీ రెండేళ్లుగా షెడ్డు నిర్మాణ పనులను చేపట్టడం లేదు. దీంతో యంత్రాలు నిరుపయోగంగా ఆరుబయట ఎండకు, వానకు తడుస్తున్నాయి. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి షెడ్డు లేక నిరుపయోగంగా తుప్పుడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా రైతులను ఆర్థికంగా అభివృద్ధి పర్చి ఆధునిక యంత్రాలపై శ్రద్ధ వహించి వాటికి షెడ్డు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.



కులకచర్ల సెర్ప్ కార్యాలయం ముందు వృథాగా ఉన్న విత్తనాల యంత్రం



నిరుపయోగంగా ఉన్న కల్టివేటర్, యంత్రాలు

అధికారులకు నివేదించాం

తక్కువ మంది రైతులు యంత్రాలను కిరాయికి తీసుకెళ్తున్నారు. కిరాయి రాక నిరుపయోగంగా ఉన్నాయి. ఈ విషయంపై జిల్లా అధికారులకు సమాచారం అందించాం. వ్యవసాయ పరికరాలు పాడవకుండా షెడ్డు నిర్మించాలి. నిధులు మంజూర్ చేసి టెండర్ పూర్తయి రెండేళ్లు అవుతుంది. కానీ షెడ్డు నిర్మాణపు పనులను చేపట్టడం లేదు.

- శోభ, సెర్ప్, ఏపీయం

ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్ రూరల్, జూలై 22: శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఈ రోజు తెల్లవారుజామున వెళ్లాల్సిన రెండు విమానాలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. శంషాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఆకాశ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం సోమవారం ఉదయం 5గంటలకు బయలేదేరాల్సి ఉంది. అయితే, అది సాయంత్రం మూడు గంటలకు బయలుదేరింది. అదేవిధంగా శంషాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్లాల్సిన అలయన్స్ ఎయిర్‌లైన్స్ విమానం ఉదయం 8.30 గంటలకు బయలు దేరాల్సి ఉండగా.. ఆలస్యంగా సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరింది. ఈ విమానాలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులను మరో విమానంలోనైనా ఢిల్లీ చేర్చే ప్రయత్నం చేయక ఇబ్బందులకు గురిచేశారని వాపోయారు. చివరకు ప్రయాణికులను ఆలస్యంగా తరలించారు. అయితే, సాంకేతిక లోపం వల్లే విమానాలు ఆలస్యంగా బయలుదేరాయని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

క్రికెట్ క్విజ్ విజేతగా దోమ విద్యార్థి

దోమ, జూలై 22: ఇటీవలే టీ 20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్ జరిగిన విషయం తెలిసిందే. అందులో భాగంగా స్టార్ స్పోర్ట్స్ సారథ్యంలో ఆన్‌లైన్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో వికారాబాద్ జిల్లా దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గౌర్వార్ అంకిత్ రావు పాల్గొని విజేతగా నిలిచాడు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థి గౌర్వార్ అంకిత్‌రావుకు దాదాపు రూ.30వేలు విలువ గల కెంట్ ఏఎల్ పీఎస్ యూవీ ఎయిర్ ప్యూరిఫైర్‌ను సోమవారం బహూకరించారు.



విజేతగా నిలిచిన విద్యార్థి అంకిత్‌రావు

కళలను ప్రోత్సహించాలి

షాద్‌నగర్ అర్బన్, జూలై 22: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేలా వాటిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సంస్కార భారతి, నవకళా భారతి ఆర్ట్స్ అకాడమీల ఆధ్వర్యంలో ఏవీ కన్వెన్షన్‌లో రెండు రోజులు నిర్వహించిన జాతీయ బాలల నాటకోత్సవ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన చిన్నారులు 'కర్ణభారం, నమస్కార్ జీ.. నమస్కార్' అనే నాటకాలను ప్రదర్శించారు. ఏపీకి చెందిన చిన్నారులు ప్రపంచ తంత్రం నాటకాన్ని, షాద్‌నగర్ చిన్నారులు 'మాకు స్వాతంత్ర్యం కావాలి.. తీరు మారాలి' అనే నాటకాలతో అలరించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ మాట్లాడుతూ సినీ, టెలివిజన్ రంగాల రాకతో కళాప్రదర్శనకు ఆదరణ తగ్గిందన్నారు. నాటకాలపై చిన్నారులకు ఆసక్తి కల్గించేలా ఇలా నాటక ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కళా ప్రదర్శనలకు తమ సహకారం ఉంటుందని నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వై.అంజయ్యయాదవ్, బక్కని నర్సింహులు, మునిసిపల్ చైర్మన్ నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, వీహెచ్‌పీ నేత బండారి రమేష్ అన్నారు. నవ కళాభారతి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు టీవీ.రంగయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సినీ కళాకారులు సునామి సుధాకర్, గుండు మురళి, హాస్యం రాజు, లక్ష్మీకిరణ్, మాజీ సర్పంచ్ సింగారం శ్రీనివాస్ పాల్గొన్నారు.



నేదునూరు నల్లచెరువులో చేపల మృత్యువాత

- విష ప్రయోగం చేశారని మత్స్యకారుల అనుమానం

కందుకూరు, జూలై 22: మండలంలోని నేదునూరులో గల నల్లచెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. సోమవారం ఉదయం చేపలన్నీ చనిపోయి తేలాయి. మత్స్యకారుల సంఘం మండల అధ్యక్షుడు లింగం ముదిరాజ్, జిల్లా అడ్‌మక్ కమిటీ డైరక్టర్ వెంకటేష్‌లు చనిపోయిన చేపలను పరిశీలించారు. ఈ చెరువులో చేపలు త్వరగా పెరిగి మత్స్యకారులకు ఉపాధి లభిస్తోందని, అయితే ఎవరో గిట్టని వారు చెరువులో విషప్రయోగం చేయడం వల్లే చేపలు చనిపోయి ఉంటాయని వారు అనుమానం వ్యక్తం చేశారు. సుమారు 4 టన్నుల చేపలు చనిపోయాయని, దీంతో మత్స్యకారులకు ఆర్థికంగా నష్టంవాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేపలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్టు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం మంచాల మండల అధ్యక్షుడు టి.సతీష్‌చంద్ర, నాయకులు వెంకటేష్, ఉదయ్‌కిరణ్, కృష్ణ, జంగయ్య, రమేష్, బాలేష్, పి.పాండు, ఎం.పర్వతాలు. నాగేష్, కె.యాదగిరి, పి.వెంకటేష్ పాల్గొన్నారు.

అందరి ఆమోదంతోనే చౌరస్తా విస్తరణ

- అందుకే అఖిలపక్ష సమావేశం : ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 22 : షాద్‌నగర్ పట్టణ ప్రగతికి గుండెకాయ వంటి చౌరస్తాను అందరి ఆమోదంతోనే విస్తరిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో సోమవారం పాత జాతీయ రహదారి, చౌరస్తాల విస్తరణపై అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనికి మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, బీష్వ కిష్టయ్య, మునిసిపల్ చైర్మన్ కె.నరేందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్, సీపీఎం నాయకుడు రాజు, ఆర్‌అండ్‌బీ డీఈ రవీంద్ర, కమిషనర్ వెంకన్న, సివిల్, ట్రాఫిక్ సీఐలు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, పార్టీల నాయకులు పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. మాస్టర్‌ప్లాన్ ప్రకారం పాత హైవేకు రెండు వైపులా వంద ఫీట్ల వెడల్పు ఉండాలన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు 75 ఫీట్లు, చౌరస్తా వద్ద 50 ఫీట్ల వెడల్పు ఉందన్నారు. రోడ్డు పక్కన కనీసం 25ఫీట్ల స్థలముంటేనే డ్రైనేజీ, ఇతర పనులు చేయగల్గుతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు ఇళ్ల యజమానులతో మాట్లాడి విస్తరణకు సహకరించేలా చూడాలని కోరారు. డీఈ మాట్లాడుతూ.. సర్కిల్ వద్ద నిర్మాణాలు తొలగిస్తే విస్తరిస్తామన్నారు. నర్సింహులు, ప్రతాప్‌రెడ్డి, కిష్టయ్యలు మాట్లాడుతూ రోడ్ల విస్తరణతోనే పట్టణాభివృద్ధి సాధ్యమన్నారు. అందరం భవనాల యజమానులతో మాట్లాడుదామన్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద ఫీట్లు వదిలే ఇళ్లు కట్టుకున్నారని, చౌరస్తా వద్ద మాత్రమే 50 ఫీట్ల వెడల్పు ఉందన్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని చౌరస్తాలోనే పెట్టాలని సీపీఎం, బీఎస్పీ నాయకులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూర్ వై జంక్షన్ నుంచి సోలిపూర్ జంక్షన్ వరకు ఓడ్డును రూ.110కోట్లతో విస్తరిస్తున్నారని, పట్టణ ప్రగతి కోసమే సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కారంలేని మిరప నారు.. రైతులకు నష్టం

- జిల్లా అధికారిని ఆశ్రయించిన బాధితులు
- వెంటనే స్పందించిన అధికారులు
- అనుమతులు లేని రెండు నర్సరీలకు నోటీసులు

ధారూరు, జూలై 22: కారంలేని మిరుపకాయ నారు పెట్టి నష్టపోయామని, నర్సరీ నిర్వాహకులు తమను మోసం చేశారని మిర్చి రైతులు వికారాబాద్ ఉద్యానవన అధికారి అర్చనకు ఫిర్యాదు చేశారు. ధారూరులో ఉన్న కూరగాయల నర్సరీలను అధికారులు తనిఖీలు చేసి అనుమతులు లేకుండా నర్సరీలు నడిపిస్తున్నట్లు గుర్తించి నోటీసులు జారీచేశారు. ఈ మేరకు వికారాబాద్ ఉద్యానవన అధికారుల బృందం సోమవారం సాయంత్రం మండల పరిధిలోని రాంపూర్ తండాలో మిర్చి తోటలను పరిశీలించి ఫిర్యాదు చేసిన రైతులతో మాట్లాడారు. ధారూరులోని కూరగాయల నర్సరీలో సోనాలిక రకం అని మిర్చినారును కొనుగోలు చేసి నాటు వేశామని, రాంపూర్ తండాకు చెందిన బాధిత రైతులు అధికారులకు తెలిపారు. పంట పండిన తర్వాత మిర్చిని తెంపి వికారాబాద్, తాండూర్,, ధారూరు మార్కెట్‌లకు తరలిస్తే వ్యాపారులు కొనుగోలు చేయడంలేదని వారు చెప్పారు. ఈ మిరపకాయలు సోనాలికరకం కాదని, ఇందులో కారం లేదని అసాధారణ పొడవు మాత్రమే పెరిగాయని వ్యాపారులు తిరస్కరిస్తున్నారని అధికారుల ముందు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు మిరప తోటను పరిశీలించిన అధికారులు మిరుప చెట్లను, తెంపిన మిరపకాయలను పరిశీలించారు. అనంతరం ధారూరులోని కూరగాయల నర్సరీలను అధికారులు తనిఖీలు చేశారు. ఈ నర్సరీలకు ఎలాంటి అనుమతులు లేవని ఉద్యానవన అధికారి అర్చన తెలిపారు. అనుమతులు లేకుండా నర్సరీలు నడిపిస్తూ వివిధ రకాల కూరగాయల విత్తన నారును విక్రయిస్తున్నట్లు గుర్తించామని ఆమె తెలిపారు. అనుమతులు లేని రెండు నర్సరీ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని ఆమె తెలిపారు. రాంపూర్ రైతులు పండించిన మిరప పంటలను పరిశీలించామని, నివేదికను జిల్లా అధికారికి అందజేస్తామని ఆమె తెలిపారు.



రాంపూర్‌లో మిరప తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు

కొత్తూర్, జూలై 22: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 1వ ఇంటర్నేషల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్-2024లో తిమ్మాపూర్‌నకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. గోల్డ్, సిల్వర్ మెడళ్లు సాధించారని మాస్టర్ శివకృష్ణగౌడ్ తెలిపారు. ప్రదీప్, యశ్వంత్, వాసుదేవ్ గోల్డ్‌మెడల్ సాధించారని, రిత్విక్, అవినాష్, గీతేశ్వర్ సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులను సోమవారం స్టేట్ స్కూల్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, శివకృష్ణలు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో మాస్టర్ శివకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాండుయాదవ్

రుణమాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

మహేశ్వరం, జూలై 22: రైతు రుణమాఫీలో షరతులు విధించకుండా పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతీ రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని మహేశ్వరం సొసైటీ చైర్మన్ మంచె పాండుయాదవ్ అన్నారు. సోమవారం ప్యాక్స్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు, రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు లక్ష రుణమాఫీ కూడా సరిగా చేయలేదన్నారు. లక్ష మాఫీ కూడా 30శాతం మంది రైతులకే వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 2లక్షల పంట రుణాన్ని మాఫీచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య ఉన్నారు.

చేతికొచ్చిన చెరుకు పంటపై అడవి పందుల దాడి

మర్పల్లి, జూలై 22: మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు గత 8 నెలల కిందట చెరుకు పంటను రెండు ఎకరాల్లో సాగుచేశాడు. ఆ పంట ఎదిగి చేతికొచ్చే సమయంలో ఆదివారం అర్ధరాత్రి దాదాపు అరఎకర పొలంలో అడవి పందులు ధ్వంసం చేశాయి. అటవీ పందుల బెడదతో పంటలకు నష్టం వాటిల్లుతుందని ప్రతీ సంవత్సరం సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలతో తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి దాపరించిందని రైతు శ్రీనివాస్ వాపోయాడు. చేతికొచ్చిన పంట అడవి పందుల దాడిలో ధ్వంసం కావడంతో కన్నీరుమున్నీరవుతున్నాడు. ఇప్పటికైనా అటవీ పందులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరాడు.



అటవీ పందులు ధ్వంసం చేసిన చెరుకు తోటను చూయిస్తున్న రైతు శ్రీనివాస్

బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలి



తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దారూరు, జూలై 22: అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని కామారెడ్డి ఎన్నికల సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం మండల తహసీల్దార్ సాజిదాబేగంకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు స్థానికసంస్థల్లో 42శాతానికి రిజర్వేషన్లు పెంచాలని, గొల్ల, కురుమలకు ఖాతాల్లో రూ.2లక్షలు జమ చేయాలని, బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులను కేటాయిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.రమేష్, ఓబీసీ నాయకులు గాజుల శాంతుకుమార్, భానుతేజ, శ్రీకాంత్, కృష్ణ, గోపాల్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లషన్‌ను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎం.మల్లేశ్ పటేల్ అన్నారు. రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారి వెంట ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రమేష్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య, రాఘవేందర్‌రెడ్డి, రాజు, మాణిక్యం, నర్సింహులు, శివకుమార్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని బీజేపీ నాయకులు సోమవారం మోమిన్‌పేట్ మండల బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్, రఘునాథ్‌రెడ్డి, వెంకటేశం, శివకుమార్, రమేశ్, ఎస్టీ మోర్చా భస్సీలాల్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లషన్‌ను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ ముదిరాజ్, రజనికాంత్, బాలి శివకుమార్, అంతారం లలిత, శాంత్‌కుమార్ పాల్గొన్నారు.

బషీరాబాద్: బీసీ డిక్లరేషన్ పేరుతో హామీలను ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసిందని నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బషీరాబాద్ రెవెన్యూ సీనియర్ అసిస్టెంటు వెంకటేశంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రాజ్‌కుమార్‌కులకర్ణి, మండలాధ్యక్షులు గిరిజహూరం రాఘవేందర్, ఓబీసీ మండలాధ్యక్షులు కె.జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యాలాల: బీసీలకు ఇచ్చిన హమీలను నెరవేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేశం, బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కాశీనాథ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పరిగి: బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఓబీసీ ఆధ్వర్యంలో సోమవారం పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఓబీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు టీవీ నర్సింహులు మాట్లాడుతూ.. బీసీలకు జనగణన చేపట్టి దామాషా ప్రకారం నిధుల కేటాయింపు జరగాలని డిమాండ్ చేశారు. ఎంబీసీ కులాలలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశవులు, రాముయాదవ్, హరికృష్ణ, చంద్రలింగం తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యకర్తలు కులకచర్ల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కొడంగల్ రూరల్: ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దత్తత్రేయ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాకేశ్, మండల అధ్యక్షుడు బందెప్ప, పట్టణ అధ్యక్షుడు సర్వేశ్, మండల ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో..



మేడ్చల్ టౌన్: తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్: ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి కామారెడ్డిలో ఇచ్చిన ఓబీసీ డిక్లరేషన్ హామీని వెంటనే నెరవేర్చాలని బీజేపీ మేడ్చల్ పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి సీసీహెచ్ ఈశ్వర్ కుర్మ, గుండ్లపో చంపల్లి మున్సిపాలిటీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా ఉమ్మడి శామీర్‌పేట మండల అధ్యక్షుడు కొంగ బాలకృష్ణ ముదిరాజ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఓబీసీ నాయకుడు కొంగ బాలక్రిష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ నాయకులు శామీర్‌పేట తహశీల్దార్ యాదగిరిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ నాయకులు బీమసాని విజయ్‌కుమార్, హైమారెడ్డి, పట్నం నర్సింహారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ డీఎస్ రజినికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాయకులు హనుమాన్, చలువాది ప్రవీణ్‌రావు, మహేష్, శ్రీరాములు, లక్ష్మారెడ్డి, శోభారాణి, దామోదర్‌రెడ్డి, ఆంనేయులు తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 22: బైక్‌పై వెళ్తున్న బీటెక్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనగాం జిల్లా లింగాలఘనాపూర్ మండలం నేలపోగుల గ్రామానికి చెందిన తేరాల శ్రీనివాస్ కుమారుడు బాలాజీ(19) ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని గదిని అద్దెకు తీసుకుని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక తేరాల బాలాజీ తన స్నేహితుడు నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకోల్‌కు చెందిన పవన్‌కుమార్‌ను తన కేటీఎం బైక్‌పై ఎక్కించుకొని రూంకు వస్తుండగా చౌదరిగూడ హనుమాన్ ఆలయం వద్ద చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాలాజీకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వెనుకాల కూర్చున పవన్‌కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బైక్ అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కార్మికుడు మృతి

పరిగి, జూలై 22: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ కార్మికుడు మృతి చెందాడు. అస్సాం రాష్ట్రం ఉదల్‌గిరి జిల్లా మంజబట్ మండలం కుచుబరి గ్రామానికి చెందిన పరిమల శీలశర్మ(48) పరిగి శివారులోని సుగుణస్టీల్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి పరిగి నుంచి కంపెనీకి వెళుతుండగా సయ్యద్‌మల్కాపూర్ శివారులోని పెంట్రోల్ పంపు దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన శీలంశర్మను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కంపెనీ సూపర్‌వైజర్ లాగన్‌సాయే ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు..

దోమ, జూలై 22: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సున్నల అనంతయ్య(62) అదే గ్రామానికి చెందిన వెంకట్ నర్సింహారెడ్డి దగ్గర పొలం కౌలుకు తీసుకున్నాడు. ఈనెల 13న బోరు మోటార్ నడవడం లేదని చూసి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లగా ఫ్యూజ్ పోవడంతో దాన్ని సరిచేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం మృతుడి కుమారుడు హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ



బాధితురాలు స్వరూప

కీసర రూరల్, జూలై 22: ఓ దుండగుడు మహిళ మెడలోంచి ఏడు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించుకెళ్లాడు. ఈ ఘటన సోమవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నారం స్వరూప(65) నాగారం మున్సిపాలిటీ వెంకటేశ్వరనగర్ కాలనీలో నివాసముంటోంది. ఆమె సోమవారం మందులు కొనుగోలు చేసేందుకు మెడికల్ షాపునకు వెళ్లింది. పని ముగించుకుని తిరిగి ఇంటికెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె వెనుక నుంచి వచ్చి పుస్తెలతాడు లాక్కెళ్లాడు. ఆమె తేరుకునే సరికే సిద్ధంగా ఉంచుకున్న బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

మేడ్చల్ టౌన్, జూలై 22: బాలికపై లైంగికదాడి చేసిన నిందితుడికి మేడ్చల్ పోక్స్ కోర్టు న్యాయాధికారి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోక్సో కోర్టు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాంతరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2018లో అల్వాల్‌లో ఎనిమిదేళ్ల బాలికను రాజస్థాన్‌కు చెందిన రాకేష్ కునావత్(25), తన స్నేహితుడు భరత్ దినేష్‌తో కలిసి ఢిల్లీకి తీసుకెళ్లాడు. అక్కడ హోటల్‌లో ఆమెపై లైంగికదాడి చేశాడు. అనంతరం బాలికను హర్యానా తీసుకెళ్లి ఆమెను మానసికంగా వేధించి హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాకేష్ కునావత్, భరత్ దినేష్‌లపై కేసునమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. అనంతరం కేసును పరిశీలించిన రాకేష్ కునావత్‌కు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయాధికారి జంగా జీవన్‌కుమార్ తీర్పునిచ్చారు.

నార్నె ఎస్టేట్‌లో పుర్రె కలకలం

● ఆరు నెలల క్రితం చనిపోయినట్లు గుర్తింపు



ఘటనాస్థలం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు

మేడ్చల్ టౌన్, జూలై 22: గుర్తు తెలియని మహిళ పుర్రెను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అత్వెల్లి సమీపంలోని నార్నె ఎస్టేట్‌లో సోమవారం ఓ గుర్తు తెలియని మహిళ పుర్రెను అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి కనబడగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఘటనా స్థలం వద్దకు చెరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. పుర్రె సమీపంలో చీర, ఇతర దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గాంధీ ఆసుపత్రి ఫోరెన్సిక్ నిపుణులను పిలిపించి దర్యాప్తు చేపట్టారు. సుమారు ఆరునెలల క్రితం మృతి చెందిన మహిళ పుర్రెగా గుర్తించారు.

కాళికాదేవి జాతరకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న అధికారులు, అర్చకులు

తాండూరు, జూలై 22: ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించే కాళికా దేవి బోనాల జాతర మహోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు సోమవారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, అర్చకులు ఉన్నారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులకు మెడల్స్‌ను అందజేస్తున్న గ్రాండ్‌మాస్టర్ హన్మంతు, కోచ్ గ్యార నాగరాజు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 22: తైక్వాండో సబ్‌జూనియర్ పోటీల్లో మండలంలోని ఎదులాబాద్‌కు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో అంతర్జాతీయ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్‌షిప్-2024లో భాగంగా ఆదివారం రాత్రి జరిగి త్వైకాండో సబ్ జూనియర్ పోటీలు జరిగాయి. ఎదులాబాద్‌కు చెందిన క్రీడాకారులు కందుల కీర్తిక (గోల్డ్‌మెడల్), బాధిని దీక్షిత్, (గోల్డ్‌మెడల్), కందుల మణికంఠ సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. వీరికి గ్రాండ్ మాస్టర్ హన్మంతు మెడల్స్‌ను ప్రధానం చేశారు. కోచ్ గ్యార నాగరాజును ఆయన అభినందించారు.

రైల్వేట్రాక్ సమీపంలో బురదమయం



మొరంగపల్లి రైల్వేగేటు దగ్గర బురదమయంగా మారిన రోడ్డు

మోమిన్‌పేట్, జూలై 22: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొరంగపల్లి రైల్వే ట్రాక్ సమీపంలో రోడ్డు గుంతలుగా మారి బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా మోమిన్‌పేట్ నుంచి శంకర్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టుల దగ్గర వర్షపు నీరు చేరి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ దగ్గర, పెద్దవాగు వంతెన దగ్గర రోడ్డు గుంతలమయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు సన్మానం



బషీరాబాద్: అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

బషీరాబాద్, జూలై 22: బషీరాబాద్ ఎంపీడీవో జె.రాఘవులు, ఎంపీవో రమేష్‌తో పాటు 14 మంది గ్రామ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఈక్రమంలో సోమవారం కార్యాలయంలో అధికార సిబ్బంది శాలువా, పూలమాలతో వారిని ఘనంగా సన్మానిస్తూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీవో శారద, సీనియర్ అసిస్టెంట్ శేర్ ఖాన్, కార్యదర్శులు, స్థానికులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎంపీవో రమేష్‌ను వికలాంగుల సంఘం మండలాధ్యక్షులు రాజుగౌడ్ సోమవారం కార్యాలయం ఆవరణలో పూలమాలతో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గత 18 సంవత్సరాలుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ.ఖాజ బదిలీపై పూడూరు మండలానికి వెళ్లడంతో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది జగన్ యాదవ్, మహేశ్‌గౌడ్, ఆలవేలు, సునిత, మౌనిక, రాజు, హరిత, రాఘవేందర్, వంశీ, రాందాస్, మమత, నర్సిములు, బాబు, నర్సింహులు పాల్గొన్నారు.

ఆర్ఐ బాల్‌రాజ్ బదిలీ

తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ బాల్‌రాజ్ సోమవారం బదిలీపై వెళ్లారు. సాధారణ బదిలీలో భాగంగా బాల్‌రాజ్ హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లినట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. గత రెండు రోజుల కిందట ఆర్ఐ రాజిరెడ్డి రంగారెడ్డి జిల్లాకు, అటెండర్ లక్ష్మమ్మ యాలాల మండలానికి ఇప్పటికే బదిలీ అయ్యారు.

బదిలీ అయిన ఉపాధ్యాయుల ఔధార్యం

యాలాల: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రాస్నం నుంచి ఇటీవల జరిగిన బదిలీలో స్థానచలనం పొందిన ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణయ్య, రాజేష్, మమత‌లు వారి జ్ఞాపకంగా పాఠశాలకు తమ వంతుగా రూ.12వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయకులు సిహెచ్ నరహరిరెడ్డి, ఉపాధ్యాయులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తాండూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

తాండూరు, జూలై 22: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్మికులు తాండూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 30న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్మికులు యూనియన్ నాయకులు భీమయ్య, జిలాని, అంబరప్ప, షబ్బీర్, రాములు, శ్యామప్ప, వెంకటప్ప, నర్సింహులు, శాంతమ్మ, వెంకటమ్మ, లక్ష్మి, భీమమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

దౌల్తాబాద్, జూలై 22: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టులను మంజూరు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, మాజీ జడ్పీటీసీ జంగం వీరన్న సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాతో కోరారు. కళాశాల భవన నిర్మాణం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పోస్టులు మంజూర్ చేశామని, త్వరలోనే బడ్జెట్ మంజూర్ అవుతుందని ఆర్థికశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి



విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్న ఏసీపీ రాములు

శామీర్‌పేట, జూలై 22: విద్యార్థులు చైతన్యవంతులై మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించాలని ఏసీపీ రాములు పిలుపునిచ్చారు. మండలంలోని ఉప్పరిపల్లి పరిధిలోని ఎక్సలెన్షియా జూనియర్ కళాశాల్లో సోమవారం విద్యార్థులకు పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాములు మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌ను సరఫరా చేసిన వారిపై కఠినంగా వేటు వేస్తామని ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు హరిక, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు, కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు జారీ చేయాలి

తాండూరు, జూలై 22: కొత్తరేషన్ కార్డులు జారీ చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పాత రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు నమోదు చేసి వెంటనే కార్డులను ఇవ్వాలన్నారు. లేదంటే తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీకి రేషన్ కార్డు లింక్ పెట్టి పేదలకు అన్యాయం చేస్తోందన్నారు. రేషన్‌కార్డులు సబ్సిడి కి రేషన్ కార్డు లింకుపెడుతూ పేదలకు అన్యాయం చేస్తుందని అన్నారు. రేషన్ కార్డులు జారీ చేయకండా నిబంధనలు పెడితే ఎలా అని ఆయన ప్రశ్నించారు.

చేతిపంపులు మరమ్మతు చేయించాలి

ధారూరు, జూలై 22: మండలంలోని మోమిన్‌కుర్దు గ్రామంలో చెడిపోయిన చేతి పంపులను మరమ్మతు చేయించాలని ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎండీ.గౌస్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలోని ఈడ్గి రాములు ఇంటి వద్ద, పాఠశాల ఆవరణలో, చాకలి సంగమ్మ, గంగారంల ఇంటి వద్ద ఉన్న చేతి పంపులు చెడిపోయి నాలుగునెలలు గడుస్తోందని తెలిపారు. ఇప్పటికైనా చెడిపోయిన చేతి పంపుల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

ఎస్సీలుగా గుర్తించండి

తాండూరు, జూలై 22: కుర్వగా పిలువబడే మాదాసికురువ, మాదారికురువ కులానికి ఎస్సీకుల ధృవీకరణ పత్రాలు మంజూరుచేయాలని కోరుతూ తాండూరు నియోజకవర్గ కురువ సంఘం ప్రతినిధులు సోమవారం తాండూరు ఆర్డీవో శీనివాస్ రావుకు వినతిపత్రాన్ని సమర్పించారు. 1956 నుంచి రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయే వరకు తమ కులం ఎస్సీ లిస్ట్‌లో క్రమసంఖ్య 30లో మదాసికరువ, మదారి కురువగా ఉన్నదని వారు వివరించారు. గొర్రెకాపరులుగా సంబర జీవనం సాగిస్తు జీవనం సాగిస్తున్నామని కుర్మ అని పేరు పెట్టి బీసీ క్రమసంఖ్య 11లో కుల పత్రాలను తప్పుగా మంజూరు చేస్తున్నారని వారు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగారం జగదీష్, ప్రధాన కార్యదర్శి ఇందూర్ మల్లేశం, పూజారి పాండు, పల్లె వెంకటయ్య, నర్సింహహులు, గోపాల్, పూజారి మల్లప్ప, జిన్‌గుర్తి నర్సింహులు, హన్మయ్య, కుర్వ బాలు, బీరప్ప, వెంకటయ్య, కిష్టప్ప, వెంకటప్ప, రఘు, మాజీ ఎంపిటిసి సభ్యులు శాంతుకుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలి

యాలాల, జూలై 22: సైబర్ నేరగళ్లపట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని యాలాల ఏఎస్ఐ యాదయ్యగౌడ్ అన్నారు. మండలంలోని లక్ష్మీనారాయణ చౌరస్తాలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇస్తున్న రైతు రుణమాఫీని ఆసరా చేసుకుని కొంత మంది నేరగాళ్లు రైతులకు ఫోన్‌చేసి ఓటీపీ నంబర్ చెప్పాలని సూచిస్తుంటారని అన్నారు. ఎవరైనా కొత్త నెంబర్‌తో ఫోన్ చేస్తే వారి మాటలు నమ్మి మోసపోకూడదని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో తమ ఫోన్ నెంబర్ ఓటీపీ చెప్పకూడదని సూచించారు. ఒకవేళ చెబితే బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తాన్ని వారు తీసుకుంటారని చెప్పారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్ రూరల్:** వెంకటాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ భూముల్లో క్రయవిక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఈవో లగడపాటి భాగ్యలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. దేవాలయ భూములను కాపాడాలని ప్రతిఒక్కరు కృషిచేయాలని ఈవో కోరారు.

● **కొడంగల్:** పట్టణంలోని నవీన ఆదర్శ కాన్వెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ డి.వి.నరేశ్‌రాజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకోవడంతో పాటు విశ్వరత్న అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, కరస్పాండెంట్ డి.లక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు జనార్ధన్, నాగేంద్రమ్మ, శకుంతల పాల్గొన్నారు.

● **కులకచర్ల:** కొత్తగా ఏర్పడిన చౌడాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, కేజీబీవీ భవన నిర్మాణాలక సోమవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం చౌడాపూర్ మండల కేంద్రలంఠని ఎంపీడీవో కార్యాలయం, కేజీబీవీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభు పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** ఉపాధ్యాయ వృత్తి నిస్వార్థమైనదని ప్రముఖ నవలా రచయిత ముదిగొండ శివప్రసాద్ అన్నారు. గురు పౌర్ణిమను పురస్కరించుకుని ఆదివారం రాత్రి సేవా భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని హరేరామ.. హరేకృష్ణ ఆలయంలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శామీర్‌పేట: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి(ఏఓ) రమేశ్, తాండూరు వ్యవసాయాధికారి రజిత సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జూన్ 28 లోపు కొత్తగా పట్టాదార్ పాసుపుస్తకాలు వచ్చిన రైతులందరూ పూర్తి వివరాలను ఆగస్టు 5 తేదీలోపు

● **కులకచర్ల:** ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో రామకృష్ణ దరఖాస్తులు స్వీకరించారు. గృహలక్ష్మీ వర్తించడం లేదని కొంత మంది, రేషన్ కార్డులు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం తయారీ బిల్లులు అందించాలని మహిళలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్ ఉన్నారు.

● **బషీరాబాద్:** మైల్వార్ ఎల్లమ్మ చెరువు ప్రధాన కాల్వ పూడికతీతకు అనుమతి ఇప్పించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులు సోంపల్లి బిచ్చిరెడ్డి, నాగేష్ తదితరులు బషీరాబాద్ ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ వెంటనే స్పందిస్తూ అటవీశాఖ అధికారులతో చర్చించి అనుమతిచ్చేలా చర్యలు తీసుకోవడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

● **పరిగి:** హైకోర్టు న్యాయవాది రాపోల్ భాస్కర్ మాతృమూర్తి రాములమ్మ జ్ఞాపకార్థం పరిగి బార్ అసోషియేషన్‌లో సోమవారం న్యాయవాదులకు కొత్త చట్టాల సవరణకు సంబంధించి పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అనంతరం కొత్తగా వచ్చిన ఏపీపీవో గోపాల్, ఏజీపీగా నియమితులైన బాలముకుందంలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస్, భక్తకుమార్, ట్రెజరర్ అలీమోద్దీన్ పాల్గొన్నారు.

● **పరిగి:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి టీచింగ్ లెర్నింగ్ మెటిరియల్ మేళా ఎంతో ఉపయోగపడుతుందని మిట్టకోడూరు పాఠశాల హెచ్ఎం ఎండీ ఉస్మాన్ అన్నారు. పాఠశాలలో సోమవారం టీఎల్ఎం మేళాను నిర్వహించి, విద్యార్థులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహ్మారాజు, కృష్ణయ్య, రాజు,కవితలు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పట్టనంలోని ప్రతి ఒక్కరు పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, వ్యాదులు ప్రభలకుండ అరికట్టాలని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమీషనర్ వెంకటగోపాల్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాదుల నివారణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక, వార్డు ఆఫీసర్లు, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** గ్రామాల్లో చెత్తను తీసుకుపోయే ట్రాక్టర్‌ను కొనసాగించాలని ఎంపీడీవో యాదగిరికి గోవిందాపూర్ మాజీ సర్పంచ్ పోచయ్య సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి గీత, ఏపీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

● **కీసర:** మండల కేంద్రం కీసరకు చెందిన మల్యాల రాములమ్మ సోమవారం మృతిచెందగా బాధిత కుటుంబానికి మాజీ ఎంపీటీసీ, ఉపసర్పంచ్ బెలిదె రమేష్ గుప్తా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు